క్లుప్తంగా

ఘనంగా కృష్ణాంజనేయ తీర్థం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు

రాంబిల్లి : గోవిందపాలెం గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణాంజనేయ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జోగా మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు జోగా దేముడు, జోగా చంటి, మాజీ సర్పంచ్ కిల్లాడ అప్పలరాజుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు శ్రీకృష్ణుడు, ఆంజనేయస్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ దీనబంధు చర్యలు తీసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

కోటవురట్ల : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని, విధిగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో శాఖల వారి సమీక్ష ఉంటుందని తెలిపారు.

బాధిత మహిళకు ఇంటి స్థలం మంజూరు



బాధిత మహిళకు పీఎల్ పురంలో ఇంటి స్థలం అప్పగిస్తున్న తహసీల్దార్ జయప్రకాష్

పాయకరావుపేట: ఇంటి స్థలం కోసం వీఆర్వోతో లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళకు ప్రభుత్వం పీఎల్ పురంలో ఇంటి స్థలం కేటాయించింది. స్థలాన్ని కొలతలు వేసి హద్దులు నిర్ణయించి బాధితురాలికి అప్పగించినట్టు తహసీల్దార్ జయప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పదాల సోమన్నదొర పాల్గొన్నారు. తనకు ఇంటి స్థలం మంజూరు చేసిన ప్రభుత్వానికి అధికారులకు స్థానిక నాయకులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

రైతులకు రాయితీపై విత్తనాలు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : రబీ సీజన్‌లో రైతులు ఈ–పంట నమోదు చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలంలోని తోటాడ ఆర్‌బీకేలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించి రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే ఈ–పంట నమోదుపై దృష్టి సారించాలన్నారు. అధికారుల సలహాలు,సూచనలు పాటించాలన్నారు. వీఏఏ భవాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుద్ద రవి, బుద్ద రమేష్‌నాయుడు, మళ్ల మహాలక్ష్మినాయుడు,ఆళ్ల శివాజీ, ఆర్‌బీకే కన్వీనర్ బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నేడు

రాంబిల్లి : సచివాలయం కన్వీనర్లు, గృహసారథులతో శనివారం పంచదార్ల, రాంబిల్లిలలో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు తెలిపారు. పంచదార్లలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మురకాడ, కట్టుబోలు, దిమిలి, మామిడివాడ, గోకివాడ, పంచదార్ల, హరిపురం, రాజుకోడూరు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతోను సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాంబిల్లి తుపాను షెల్టర్‌లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలో మిగిలిన సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో సమావేశాన్ని నిర్వహిస్తారని, ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు హాజరవుతారని అన్నారు.

‘స్థానిక’ పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక

ఎస్.రాయవరం ఎంపీపీగా కోన లోవలక్ష్మి



ఎంపీపీగా కోన లోవలక్ష్మిని ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రొసీడింగ్ అధికారి లక్ష్మీపతి

ఎస్.రాయవరం: మండల ప్రజా పరిషత్ అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవంగా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఎన్నికల ప్రొసీడింగ్ అధికారిగా డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి వ్యవహరించారు. ఇటీవల కొన్ని అనివార్య కారణాల వల్ల మండలాధ్యక్షురాలు బొలిశెట్టి శారదాకుమారి రాజీనామా చేయడంతో ఇక్కడ ఎంపీపీ పదవి ఖాళీ ఏర్పడింది. ఈ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నిక నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కోన లోవలక్ష్మి ఎంపీపీ పదవికి ఏకైక నామినేషన్ దాఖలు చేశారు. చినగుమ్ములూరు ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి ప్రతిపాదించారు. ఎస్.రాయవరం 1 ఎంపీటీసీ అభ్యర్థి బైపా శ్రీనివాసరావు బలపరిచారు. దీంతో ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. లోవలక్ష్మిని పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, కాపు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ , వైస్ఎంపీపీ చోడిపల్లి అప్పన్న తదితరులు అభినందించారు. దుస్సాలువాతో సత్కరించి పార్టీ ఘన విజయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నిక ప్రక్రియను ఎంపీడీవో రామచంద్రమూర్తి పర్యవేక్షించారు.

పాయకరావుపేట వైస్ ఎంపీపీగా స్వామి

పాయకరావుపేట : మండల పరిషత్ రెండో ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. ఎస్.నర్సాపురం ఎంపీటీసీ (వైఎస్సార్‌సీపీ) పల్లేల మణికంఠస్వామి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నిక నిర్వహించగా, ఎన్నికల అధికారిగా కె.లచ్చన్న వ్యవహరించారు. ఉపాధ్యక్ష పదవి కోసం మణికంఠ స్వామి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీపీ ఇసరపు పార్వతి ప్రతిపాదించగా, పాల్తేరు ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ బలపరిచారు. మణికంఠస్వామి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి లచ్చన్న ప్రకటించారు. ఇతనికి ధ్రువపత్రాన్ని అందజేశారు. ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ ఎంపీపీగా ఎన్నికైన స్వామిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు సూరచక్రం, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను అభినందించారు.



వైస్ ఎంపీపీగా ఎన్నికైన స్వామిని అభినందిస్తున్న నాయకులు, ఇతర ఎంపీటీసీలు

కో ఆప్షన్ సభ్యుడిగా ఖుదా బాషా

కోటవురట్ల : కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం అయింది. మెజార్టీ సభ్యులు వైఎస్సార్ సీపీకి చెందినవారే కావడంతో ఎటువంటి ఆటంకం లేకుండా ముగిసింది. కాగా ఈ ఎన్నిక ప్రక్రియకు టీడీపీ సభ్యులు దూరంగా ఉండగా వైఎస్సార్‌సీపీకి చెందిన పది మంది ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. కో ఆప్షన్ సభ్యుడి పదవి కోసం ఒకే ఒక నామినేషన్ దాఖలయింది.



ఎన్నిక ధ్రువపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కో ఆప్షన్ సభ్యుడిగా ముస్లిం వీధికి చెందిన ముస్లిం మైనార్టీకి చెందిన ఖుదా బాషాను ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు ప్రతిపాదించగా, మరో ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి రాంబాబు బలపరిచారు. దీన్ని మిగతా సభ్యులందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా బాషాను కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికల అధికారి ఉదయ శ్రీ ప్రకటించారు. అనంతరం ఎన్నిక ధ్రువపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు ఆర్.ఎస్.సీతారామరాజు, చక్కా సుజాత, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం

- ఆయనపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది
- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు



గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): విశాలమైన సైన్యంతో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. శుక్రవారం అచ్యుతాపురం మండల కార్యాలయాల మైదానం వద్ద వైఎస్సార్‌సీపీ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రత్యేక స్థానమున్న ఏపీలో సీఎం జగన్‌పై అందరికీ విశ్వాసం ఉందన్నారు. ‘మా నమ్మకం నువ్వే జగనన్న ’కార్యక్రమంపై గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కల్పించారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి పార్టీని మరింత చేరువ చేయాలని, అందుతున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. టీడీపీకి గృహ సారథులు కొన్ని మీడియా సంస్థలైతే, వైఎస్సార్‌సీపీకి గృహ సారథులు ప్రజలేనని అన్నారు. నియోజక వర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజలకు వాస్తవాలను తెలియపరచాలని సూచించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల పార్టీ నాయకులు కోన బుజ్జి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

మునగపాక : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. శుక్రవారం మునగపాక ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సక్రమంగా వినియోగం జరిగేలా చూడాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ పథకాలు వైద్య పరంగా అందరికీ అందేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, ఎంపీడీవో రవికుమార్, వైద్యాధికారి ప్రవలిక, సీహెచ్‌వో దేవకాంత సమావేశంలో పాల్గొన్నారు.

మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

రాంబిల్లి : రాంబిల్లి శివారు వాడపాలెంలో మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం ఎస్‌ఐ దీనబంధు వాడపాలెం తీరప్రాంతాన్ని పరిశీలించారు. ఆయా గ్రామ నాయకులు, గజ ఈతగాళ్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ, ఆదివారం మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో వుంచుతామన్నారు.



వాడపాలెం తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ దీనబంధు

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

ఎస్.రాయవరం : సర్వసిద్ధి గ్రామంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనం త్వరితగతిన పూర్తి చేయాలని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ సూచించారు. సర్వసిద్ధి పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వైద్యులకు ఆదేశాలు ఇచ్చారు. సచివాలయాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి, యాంటి లార్వ ఆపరేషన్, కీటక జనిత వ్యాధులపై అవగాహన పెంచాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టు సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు శక్తిప్రియ, వాసంత్ పాల్గొన్నారు.



పీహెచ్‌సీ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

దుకాణంలో గ్యాస్ లీకై మంటలు వ్యాప్తి

యలమంచిలి : చిరు తిను బండారాలు దుకాణం వద్ద వంట గ్యాస్ లీకైన ఘటన యలమంచిలిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. యలమంచిలి అగ్నిమాపక శాఖ అధికారి రాంబాబు తెలిపిన వివరాలివి. యలమంచిలి ప్రధాన రహదారిలో పాత ఎస్‌బీఐ బ్యాంకు రోడ్డు వద్ద ఓనమ్ ఆదిలక్ష్మికి చెందిన (బజ్జీల కొట్టు) ఉన్న చిరు తిళ్ల దుకాణం వద్ద వంట గ్యాస్ లీకై ఆకస్మికంగా మంటలు వ్యాప్తి చెందాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 10 వేల రూపాయలు వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు ఆయన పేర్కొన్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

మునగపాక గౌరీ పరమేశ్వరుల ఉత్సవం నేడు

మునగపాక : స్థానిక గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం గౌరీ పరమేశ్వరులను గ్రామంలో ఊరేగిస్తామన్నారు. అలాగే రాత్రికి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నేల వేషాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ నేతృత్వంలో బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించే ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతరలో సేవలందించండి

ఎస్.రాయవరం: రేవుపోలవరం జాతరకు సచివాలయ సిబ్బంది , వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ జాతర భక్తులకు సేవలందించాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. రేవుపోలవరం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఎక్కడికక్కడే అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లే లోవరాజు, రేవు పోలవరం ఉపసర్పంచ్ చోడిపల్లి గోవిందు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి : విద్యుత్ పనులు కారణంగా శనివారం ఐదు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ రమణమూర్తి తెలిపారు. రాజుకోడూరు, కృష్ణంపాలెం, ఆర్.నర్సాపురం, జంగాలపాలెం, వెల్చూరు పరిధిలో ఆక్వా కల్చర్ సర్వీస్‌లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా వుండదని, వినియోగదారులు సహకరించాలని రమణమూర్తి కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

అనకాపల్లిటౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌ఈఈడీఏపీ సంస్థల ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా అచ్యుతాపురంలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 27సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. డిప్లొమా, బీటెక్ (మెకానికల్, ప్రొడక్ట్, ఆటోమొబైల్) చేసిన నిరుద్యోగులకు శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, మూడో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 70363 63272, 90147 70309 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- యలమంచిలిలో గడప గడపకు మన ప్రభుత్వం



అంగన్‌వాడీ సిబ్బందికి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : పట్టణ గ్రామాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారని యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) పేర్కొన్నారు. శుక్రవారం యలమంచిలి మున్సిపాలిటీ తులసీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

తులసీనగర్ సచివాలయ పరిధి జలాల వీధి, వినాయక గుడి వీధిలో ప్రతి ఇంటిని సందర్శించి మూడున్నరేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న లబ్ధిదారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. యలమంచిలిలో నూతనంగా నిర్మిస్తున్న టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరిని అనర్హులుగా అధికారులు గుర్తించారని వారు డిపాజిట్‌గా కట్టిన నగదు తిరిగి ఇవ్వలేదని కన్నబాబుకు లబ్ధిదారులు విన్నవించగా మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారితో మాట్లాడి లబ్ధిదారులకు డిపాజిట్ నగదు వచ్చేలా చూడాలని అన్నారు. నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నియమింపబడిన సిబ్బందికి నియామక పత్రాలను అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న కాలనీల ద్వారా ప్రజలకు సొంతింటి కలను నిజం చేస్తూ ఒకే చోట వందలాది గృహాలను నిర్మిస్తూ సరికొత్త గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో గృహాలు త్వరితగతిన నిర్మించుకోవాలని పలువురికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ (చిన్నా), మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, కౌన్సిలర్లు డాక్టర్ త్రినాథ్, గంధం శివ పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించండి



వాహనదారులకు హెల్మెట్ ధరించాలని పూలతో తెలుపుతున్న సీఐ షేక్ గఫూర్

యలమంచిలి : రహదారి భద్రత జీవితానికి రక్ష అని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం యలమంచిలి మండలం రేగుపాలెం హైవే కూడలి వద్ద ద్విచక్ర వాహనదారులకు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రహదారి భద్రత నియమాలు పాటించాలని, అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవద్దని సూచిస్తూ వాహనదారులకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి విధిగా హెల్మెట్ ధరించాలని స్నేహపూర్వకంగా కోరారు. యలమంచిలి ట్రాఫిక్ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధికంగా హెల్మెట్లు ధరించని కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహాలు ఇవ్వరాదని, యువత మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, మహిళా పోలీసులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగులో అధికారుల సలహాలు పాటించాలి

మునగపాక : పొలంబడి ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని అనకాపల్లి డాట్ సెంటర్ శాస్త్రవేత్త భవానీ తెలిపారు. తిమ్మరాజుపేటలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. నువ్వు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి ద్వారా తెగుళ్ల నివారించవచ్చన్నారు. పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వ్యవసాయాధికారి తులసీ మణి, వీఏఏ శ్వేత మీనన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాడ్రాపల్లిలోని వరి పైరును అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు పరిశీలించారు. వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి, వీఏఏ తులసి పాల్గొన్నారు.



వాడ్రాపల్లిలో వరి పైరు పరిశీలిస్తున్న సహాయ సంచాలకుడు రామారావు

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు చర్యలు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మంజులవాణి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి మంజులవాణి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందించేలా చూడాలన్నారు. అలాగే కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

జాతరకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు



రేవుపోలవరం తీరంలో పర్యటిస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

ఎస్.రాయవరం : రేవుపోలవరం మాఘపౌర్ణమి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. రేవుపోలవరం తీరంలో జాతర నిర్వహించే ప్రదేశాన్ని శుక్రవారం సందర్శించారు. ఆదివారం జరిగే జాతరకు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జనాభా రద్దీగా ఉన్న చోట చైన్ స్నాచర్స్, జేబుదొంగల సమస్య ఉంటుందని పర్యవేక్షణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం ఉన్న గ్రామాల కూడలిలో విధిగా బందోబస్తు ఉంచాలన్నారు. ఈ పర్యటనలో డీఎస్పీ వెంట నక్కపల్లి సీఐ నారాయణరావు, ఎస్‌ఐ ప్రసాద్ రావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు, సర్పంచ్ మల్లే లోవరాజు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు

మునగపాక : గంగాదేవిపేటలో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని మూలపేట పంచాయతీ ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర తెలిపారు. గంగాదేవిపేటలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాదేవిపేటలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. సర్పంచ్ గంగప్పలనాయుడు సహకారంతో గంగాదేవిపేటలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

7,8 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

అనకాపల్లిటౌన్: విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7, 8 తేదీల్లో స్థానిక కార్మిక–కర్షక నిలయంలో జిల్లా మహాసభలను ఏర్పాటు చేసినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణ తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, నక్కపల్లి డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లాలో మిగిలిన మండల ప్రధాన కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. విశ్వవిద్యాలయాలకు, గిరిజన యూనివర్సిటీలకు కేంద్ర ప్రభుత్వం తక్కువ బడ్జెట్ కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గొర్లి తరుణ్, బాబ్జి, ప్రసాద్ పాల్గొన్నారు.

పడమటమ్మ తీర్థ మహోత్సవం రేపు

కశింకోట: కశింకోటలోని కస్పావీధిలో కొలువుదీరిన పడమటమ్మ తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 5న జరపనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద మధ్యాహ్నం ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కస్పావీధి నుంచి అమ్మవారి ఆలయం వరకు కోలాటాలు, భజనలు, తోడపెద్దు సేవతో ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు.